సాక్షి అన్నమయ్య జిల్లా

బుధవారం । 20 । నవంబర్ । 2024



ఆరోపణల అధికారికి అందలం

బి.కొత్తకోట ఆలయాల గ్రేడ్–3 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మునిరాజ అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నా.. ఉన్నతాధికారులు అందలం ఎక్కించారు. -8లో



ఆక్రమణను అడ్డుకున్న గ్రామస్తులు

రైతులు పంట ఉత్పత్తులను నూర్పిడి చేసుకునేందుకు వినియోగిస్తున్న స్థలాన్ని అక్రమార్కులు ఆక్రమించేందుకు ప్రయత్నించగా గ్రామస్తులు అడ్డుకున్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.340	రూ.400
రెండోరకం	రూ.230	రూ.336



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 213 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	495	563
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 491.580 కిలోలు

న్యూస్‌రీల్

ఉత్తమ ఫలితాలు సాధించాలి



స్కూల్ తరగతి గదిలో డీఈఓ సుబ్రమణ్యం

లక్కిరెడ్డిపల్లి: పదో తరగతిలో కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈఓ డాక్టర్ సుబ్రమణ్యం పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌ను ఆయన పరిశీలించారు. ముందుగా అన్ని తరగతుల్లోకి వెళ్లి జరిగిన పాఠ్యాంశాలు గురించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తరగతులు ద్వారా పదో తరగతి విద్యార్థులు సామర్థ్యాన్ని వెలికి తీయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ–2 వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మద్యం దుకాణాల సామగ్రి వేలం

మదనపల్లె: ఆంధ్రప్రదేశ్ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్(ఏపీఎస్‌బీసీఎల్) మదనపల్లె డిపోలో నిర్వహించిన బహిరంగ వేలంలో ప్రభుత్వానికి రూ.96,536 ఆదాయం లభించినట్లు డిపో మేనేజర్ వి.శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం డిపోలో బహిరంగ వేలం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ మద్యం దుకాణాల్లో వినియోగించిన ఫ్రీజర్లు, బ్యాటరీలు, ఇన్వర్టర్స్, క్యాష్ చెస్ట్, క్యాష్ కౌంటింగ్ మెషిన్లను ఏపీఎస్‌బీసీఎల్ ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం నవంబర్ 7న మొదటిసారి బహిరంగ వేలం వేశామన్నారు. కొన్ని వస్తువులు అమ్ముడుపోగా, మిగిలిన వాటికి నవంబర్ 19న వేలం నిర్వహించామన్నారు. రెండోసారి నిర్వహించిన బహిరంగ వేలంలో 10 క్యాష్ చెస్ట్, 21 క్యాష్ కౌంటింగ్ మెషిన్లను జీఎస్టీతో కలిపి రూ.96,536 రూపాయలకు పాడుకున్నారన్నారు. ఫ్రీజర్స్, బ్యాటరీ విత్ ఇన్వర్టర్స్‌కు పాటదారులు ఆసక్తి కనపరచలేదన్నారు.

కోట గోడల పునర్నిర్మాణానికి ప్రతిపాదనలు



కూలిన కోట గోడను పరిశీలిస్తున్న పురాతత్వ సర్వేక్షణాధికారి బాలక్రిష్ణారెడ్డి

సిద్దవటం: కూలిన కోట గోడల పునర్నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు జిల్లా పురాతత్వ సర్వేక్షణాధికారి బాలక్రిష్ణారెడ్డి తెలిపారు. సిద్దవటంలోని మట్లిరాజుల కోటను అసిస్టెంటు సూపరింటెండెంటు ఇంజినీర్ ప్రవీణ్ కుమార్‌తో కలిసి ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోట ప్రధాన ముఖద్వారం వద్ద గోడలు రెండు చోట్ల కూలి పోయాయన్నారు. రెండవ మండపం పైన కోట గోడ కూలి పోగా, మండపం వద్ద గోడలు దెబ్బతిన్నాయని వాటి మరమతుల కోసం ప్రతిపాదనలను పంపామన్నారు. అనుమతులు వచ్చిన వెంటనే నిర్మాణ పనులను చేపట్టడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో పురావస్తుశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షోభ హాస్టళ్లు

శిథిలావస్థకు చేరిన భవనాలు.. ఊడిపోయిన కిటికీలు.. తలుపులు లేని మరుగుదొడ్లు.. ఇరుకిరుకు గదులు.. అలంకారప్రాయంగా కుళాయిలు.. అరకొరగా తాగునీరు.. సరిపోని ఫ్యాన్లు.. అపరిశుభ్ర వాతావరణం.. ఇదీ సంక్షేమ వసతి గృహాల పరిస్థితి. విద్యార్థులకు చుక్కలు చూపిస్తూ నరకానికి నకళ్లుగా మారాయి. వీటి నిర్వహణను ప్రభుత్వం సరిగా పట్టించుకోకపోవడంతో.. ఈ పరిస్థితి నెలకొంది.

- కనీస వసతులు కరువు
- అధ్వానంగా మరుగుదొడ్లు
- కనిపించని రక్షణ గోడలు
- దుప్పట్లు అందక చలికి వణుకుతున్న విద్యార్థులు
- కాస్మోటిక్ చార్జీల అందజేతలో అలసత్వం
- సమస్యలతో సతమతమవుతున్న భావి భారత పౌరులు



జిల్లాలో కస్తూర్బా గాంధీ

గురుకుల పాఠశాలలు:	22
విద్యార్థుల సంఖ్య:	5280
సంక్షేమ వసతి గృహాలు:	55
విద్యార్థుల సంఖ్య:	4055

ఇది మదనపల్లె పట్టణం కదిరి రోడ్డులోని గిరిజన సంక్షేమ బాలుర కాలేజీ హాస్టల్. అద్దె భవనంలో నడుస్తోంది. సుమారు 80 మంది విద్యార్థులు ఉన్నారు. ఒకే షెడ్డులో సుమారు 35 మంది కిందనే పడుకుంటున్నారు. బెడ్ షీట్లు లేవు. ట్రంకుపెట్టెలు లేవు. కాస్మో టిక్ చార్జీలు ఇవ్వలేదు. ప్రహరీ గేటు విరిగింది.



ఇది మదనపల్లె పట్టణం సురభి కాలనీలోని ప్రభుత్వ బీసీ బాలుర కాలేజీ హాస్టల్. అద్దె భవనంలో నడుస్తోంది. 70 మంది విద్యార్థులున్నారు. రేకుల షెడ్డు కావడంతో పడరాని పాట్లు పడుతున్నారు. చుట్టూ ముళ్ల కంపలు, పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. రాత్రిపూట ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి. అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు.

సాక్షి రాయచోటి: సంక్షేమ హాస్టళ్లలో భద్రత గాలిలో దీపంగా మారింది. సమాజంలో అన్నిటి కంటే ప్రధానమైనది భద్రత. ప్రస్తుత పరిస్థితుల్లో ఎక్కడ చూసినా అఘాయిత్యాలు, అత్యాచారాలు పెరుగుతున్న తరుణంలో.. ఆడపిల్లల పట్ల ప్రత్యేక రక్షణ చర్యలు ఉండాలి. కానీ ఎక్కడ చూసినా వారి భద్రత విషయంలో నిఘా కనిపించడం లేదు. హాస్టళ్ల పరిసర ప్రాంతాల్లో ప్రహరీలు మొదలుకొని సీసీ కెమెరాల జాడ కనిపించడం లేదు. అంతేకాకుండా ఇతర అనేక సౌకర్యాల కల్పనలోనూ సర్కార్ పూర్తి స్థాయిలో శ్రద్ధ చూపడం లేదు. సంక్షేమ హాస్టళ్లు సంక్షోభంలో నడుస్తున్నాయి. ప్రభుత్వాల అలసత్వం, పాలకులు పట్టించుకోకపోవడంతో సౌకర్యాల లేమితో కునారిల్లుతున్నాయి. అత్యున్నత విద్యతోపాటు ఆధునిక సౌకర్యాలతో ముందుకు సాగాల్సిన హాస్టళ్లు కుచించుకుపోతున్నాయి. విద్యార్థులు కూడా సౌకర్యాలు లేక అల్లాడిపోతున్నారు. ఇటీవల హాస్టళ్లలో పరిస్థితులపై రాష్ట్ర హైకోర్టు సీరియస్ కావడంతోపాటు తీవ్ర వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో 'సాక్షి' బృందం హాస్టళ్లను పరిశీలించింది.

కనిపించని సీసీ కెమెరాలు

రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న హాస్టళ్లలో భద్రత డొల్లగా కనిపిస్తోంది. అంబేడ్కర్ గురుకులాలతోపాటు కస్తూర్బా పాఠశాలల్లో అక్కడక్కడగా సీసీ కెమెరాలు కనిపిస్తున్నా మిగిలిన సంక్షేమ హాస్టళ్లలో ఎక్కడా లేవు. కొన్ని హాస్టళ్లలో సీసీ కెమెరాలు ఉన్నా దిష్టిబొమ్మలుగా దర్శనమిస్తున్నాయి. దీనికితోడు చాలాచోట్ల అద్దె భవనాల్లో నడుస్తున్న హాస్టళ్లకు రక్షణ గోడలు కూడా లేకపోవడంతో ఇబ్బందికర పరిస్థితిగా మారుతోంది. ప్రస్తుతం చలి తీవ్రత కూడా పెరిగింది. అయితే చాలా ఎస్సీ హాస్టళ్లకు సంబంధించి కిటికీలు, తలుపులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పుడిప్పుడే దుప్పట్లను అందించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. కాస్మోటిక్ చార్జీలు సకాలంలో అందించకపోవడంతో తలకు సంబంధించిన నూనె, సబ్బులు, ఇతర వస్తు సామగ్రి తెచ్చుకోలేని పరిస్థితి నెలకొంది.

తంబళ్లపల్లెలో పెచ్చులూడుతుండటంతో మూసివేత: జిల్లాలో చాలా చోట్ల ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లకు సంబంధించి సొంత భవనాలు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. మదనపల్లె, రాయచోటి, పీలేరు, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో పలు హాస్టళ్లు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. మదనపల్లెలో అయితే పురాతన కాలం నాటి తరహాలో భవనం కనిపిస్తుండడం ఆందోళన కలిగించే పరిణామం. సొంత భవనాలు లేకపోవడంతో విద్యార్థులకు అనేక సమస్యలు వెంటాడుతున్నాయి. అంతేకాకుండా హాస్టళ్లతోపాటు కొన్ని పాఠశాలలకు రక్షణ గోడలు లేకపోవడం కూడా విషపురుగులు రావడం, రైల్వేకోడూరులో బాలికల హాస్టళ్లకు సంబంధించి ప్రహరీ లేకపోవడంతో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తంబళ్లపల్లెలో 30 ఏళ్ల పైబడిన భవనం కావడంతో పెచ్చులూడి కింద పడుతున్నాయి. భవనం కూడా శిథిలావస్థకు చేరడంతో ఇటీవల అక్టోబరు నుంచి హాస్టల్‌ను మూసివేశారు.

మినరల్ వాటర్‌కు నోచుకోని విద్యార్థులు

జిల్లాలోని వివిధ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు మినరల్ వాటర్ అందని ద్రాక్షగా మారింది. కొత్తగా నిర్మించిన గురుకులాలు, నూతన భవనాలు నిర్మించిన చోట కొంతమేర సౌకర్యాలు ఉన్నా తాగునీటికి మాత్రం చాలాచోట్ల ఇబ్బందులు తప్పడం లేదు. మినరల్ వాటర్ ప్లాంట్లు పని చేయకపోవడంతో సాధారణ బోరు నీటినే తాగాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుత సీజన్‌లో రోగాలు విజృంభిస్తున్న తరుణంలో కూడా మినరల్ వాటర్ అందకపోతే విద్యార్థులు వివిధ అనారోగ్య పరిస్థితుల బారిన పడే ప్రమాదముంది.

ఇలా ఉంటే ఎలా?

మరుగుదొడ్ల పరిస్థితి తలుచుకుంటూనే భయమేసే పరిస్థితులు నెలకొన్నాయి. మదనపల్లె లాంటి ప్రధాన పట్టణాల్లో సైతం హాస్టళ్లలో మరుగుదొడ్ల పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. మరుగుదొడ్లకు తలుపులు ఉన్నా విరిగిపోయి ఉండటంతో.. కనీసం ప్రశాంతంగా మల విసర్జన చేసేందుకు కూడా వీలులేని పరిస్థితులు నెలకొన్నాయి. దీనికితోడు వాటి నిర్వహణ కూడా సక్రమంగా లేకపోవడంతో ఒక్క మదనపల్లె కాదు. చాలా చోట్ల ఇదే పరిస్థితి నెలకొంది.

దుప్పట్లు, ట్రంకు పెట్టెలు ఇవ్వలేదు



ట్రంక్ పెట్టెలు ఇవ్వలేదు. మేము కొనుక్కుంటూ ఉన్నాము. కాస్మోటిక్ చార్జీలు అకౌంట్‌లో పడలేదు. పాడైపోయిన ట్రంక్ పెట్టెలతోనే కాలం వెళ్లబుచ్చుతున్నాము. మరుగుదొడ్లు కంపు కొడుతున్నాయి.

–సాయి కుమార్, 10వ తరగతి విద్యార్థి, బీసీ బాలుర వసతి గృహం, లక్కిరెడ్డిపల్లి

బిక్కు బిక్కుమంటూ..



మా హాస్టల్ కట్టి యాభై ఏళ్లకు పైన అయిందంట. చానా పాతబడిపోయింది. బాగా వానలు కురిసి శ్లాబు నానితే కూలినా కూలుతుంది. శ్లాబులో పెచ్చులు ఊడిపడుతుంటాయి. జరగరాని ప్రమాదం జరగక ముందే పెద్దసార్ వాళ్లు మా హాస్టల్ గురించి పట్టించుకోవాలి. – మణికంఠ, ఎస్సీ హాస్టల్, రాజంపేట

నిధులు మంజూరు కాగానే...



జిల్లాలోని బాలుర సాంఘిక సంక్షేమ గిరిజన వసతి గృహాలలో ఉన్నటువంటి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది. ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో పనులను అంచనా వేయించి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే పరిష్కరిస్తాం. – ఎస్.జయప్రకాష్, డీఎస్‌డబ్ల్యూఓ, అన్నమయ్య జిల్లా

వంట మనుషులు లేక..



నందలూరులోని బీసీ బాలుర వసతి గృహంలో వంట మనిషి లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాచ్‌మెన్‌లే వంట మనుషులుగా వ్యవహరిస్తున్నారన్నారు. ఈ వసతి గృహంలో 40 మంది విద్యార్థులకు గాను 30 మంది ఉన్నారు. మంగళవారం మెనూ ప్రకారం కలర్ రైస్, చికెన్, పెరుగు చెట్నీ చేశారు. కేవలం రెండున్నర కేజీ చికెన్ చేసి విద్యార్థులకు సర్దుబాటు చేశారు.

పెచ్చులూడుతున్నాయ్..

లక్కిరెడ్డిపల్లిలోని బీసీ బాలికల వసతి గృహం శిథిలావస్థకు చేరింది. పైకప్పు పెచ్చులూడి పడుతుండటంతో విద్యార్థినులు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. హాస్టల్ పరిధిలో మురుగునీరు కాలువతోపాటు చెత్తకుప్పలు, ముళ్లపొదలు ఉండటంతో తేలు, జర్రెలు వస్తున్నాయని విద్యార్థులు తెలిపారు.



దెబ్బతిన్న ఫ్లోరింగ్



సుండుపల్లె మండలం జేకే రాచపల్లిలోని సాంఘిక గిరిజన గురుకుల పాఠశాల హాస్టల్‌లో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. హాస్టల్‌లోని కొన్ని గదులలో ఫ్లోరింగ్ దెబ్బతినడంతోపాటు మరికొన్ని గదులలో స్లాబ్ పెచ్చులుగా రాలిపోతోంది. కిటికీలకు తలుపులు, మెస్సులు లేకపోవడంతో దోమల బెడదతో ఇబ్బంది పడుతున్నారు.

తలుపులు లేని మరుగుదొడ్లు

రాయచోటిలోని బీసీ హాస్టల్‌లో మరుగుదొడ్ల నిర్వహణ అధ్వానంగా ఉంది. కొన్నింటికి డోర్‌లు కూడా లేకపోవడంతో విద్యార్థులకు తీవ్ర అసౌకర్యంగా మారింది. దీంతో కొందరు బహిర్భూమికి వెళ్తున్నారు.



ఓడీఎఫ్ రహిత జిల్లాగా రూపొందించాలి

రాయచోటి: అవగాహన కార్యక్రమాలతో ఓడీఎఫ్ రహిత జిల్లాగా రూపొందించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ హాలులో గ్రామీణ నీటిపారుదల, పంచాయతీశాఖల ఆధ్వర్యంలో ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ప్రసన్న కుమార్, డీపీఓ బాలకృష్ణారెడ్డి, డ్వామాపీడీ వెంకటరత్నం, డీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి లక్ష్మీపతి, డీఎంహెచ్ఓ కొండయ్య, డీఆర్‌డీఏ ఐసీడీఎస్ పీడీలు సత్యనారాయణ, రమాదేవి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

- జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పథకాల నిమిత్తం పొందిన అటవీ భూములకు పరిహారంగా భూమి బదలాయింపు చేయు అంశంపై కలెక్టర్ శ్రీధర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్, అటవీ అధికారి జగన్నాథ్‌సింగ్, మదనపల్లి, రాజంపేట సబ్ కలెక్టర్లు మేఘస్వరూప్, నైదియాదేవి, డీఆర్ఓ మధుసూదన్‌రావు, రాయచోటి ఆర్డీఓ శ్రీనివాస్, సర్వే శాఖ ఏడీ భరత్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి



చిన్నమండెంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్

చిన్నమండెం/గాలివీడు: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. మంగళవారం చిన్నమండెం, గాలివీడు ఎంపీడీఓ కార్యాలయాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా కార్యాలయాల్లో సీఎంఓ పీజీఆర్ఎస్ దరఖాస్తులు, రెవెన్యూ సేవల్లో భాగంగా మ్యుటేషన్లు, చుక్కల భూములు, ఫ్రీ హోల్డ్ భూముల రిజిస్ట్రేషన్, విద్యార్థులకు అపార్ ఐడీ జనరేషన్, హౌసింగ్ జియో ట్యాగింగ్, ఎన్‌సీపీఐ బ్యాంక్ అకౌంట్లకు ఆధార్ లింక్ తదితర అంశాలలో మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

- ఈ కార్యక్రమంలో సర్వే శాఖ ఏడీ భరత్‌కుమార్, హౌసింగ్ పీడీ శివయ్య, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, వీఆర్ఓలు, హౌసింగ్ ఇంజనీర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఎంఈఓలు, ఏపీడీలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దర్జాగా ఇసుక దందా

- చెయ్యేరును తోడేస్తున్న కూటమి నేతలు
- టంగుటూరు కేంద్రంగా అక్రమ వ్యాపారం
- సొంతంగా డంపింగ్ యార్డులు



టంగుటూరులో అనధికారిక ఇసుక డంపింగ్ యార్డు

సాక్షి టాస్క్‌ఫోర్స్: కూటమి నేతలు అధికారమే అండగా.. దర్జాగా ఇసుక దందాకు పాల్పడుతున్నారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఉచిత ఇసుక విధానం వారికి వరంగా మారింది. ఇదే తడవుగా నాణ్యమైన ఇసుక లభించే నందలూరు మండలం చెయ్యేరు నదిని ఎంచుకున్నారు. రాత్రి, పగలు తేడా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇందుకు నిదర్శనం టంగుటూరు అధికారిక రీచ్ పరిధిలో సోమవారం అధికారుల దాడిలో.. జేసీబీలు, 11 ట్రాక్టర్లు పట్టుబడటమే. అయితే ఐదు ట్రాక్టర్లు, రెండు జేసీబీలను మాత్రమే నందలూరు పోలీసులకు అప్పగించారనే ఆరోపణలు వెలువడ్డాయి. ఈ విధంగా నిత్యం చెయ్యేరులో అక్రమ ఇసుక దందా యథేచ్ఛగా సాగుతోంది.

అధికార పార్టీ ఓ ప్రతినిధి కనుసన్నల్లో..

అధికార పార్టీకి చెందిన ఓ ప్రతినిధి కనుసన్నల్లో ఇసుక దందా కొనసాగుతోందని ఆ పార్టీ వర్గాలే బహిరంగంగా విమర్శిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే తనకు సంబంధం లేదంటూనే , తమకు అనుకూలమైన ఓ మాజీ ఎంపీపీ, మరికొంతమంది అనుచరులు, రీచ్ వాటదారుల పర్యవేక్షణలో అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఫలితంగా అన్ని ఖర్చులు పోగా రోజుకు రూ.2 లక్షల ఆదాయం తమ ఖాతాలో వేసుకుంటున్నారు. దీంతో అధికార పార్టీలోనే మరి కొంత మంది నేతలు రంగంలోకి దిగారు. ఇసుక రీచ్ చెన్నయగారిపల్లెకు చెందిన ఓ కాపునేత పేరుతో తెరపైకి తీసుకొచ్చి, పలువురు స్థానిక నేతలు వాటాలతో రీచ్ నడిపిస్తున్నారు. చెయ్యేరు నదీ పరీవాహక ప్రాంతమైన అటూ ఓబలి, ఇటు టంగుటూరు, కోమంతరాజుపురం, నారాయణనెల్లూరు ఇసుకాసురుల రాజ్యంగా సాగుతోంది. చెయ్యేరులో ఇసుక అక్రమ దందాపై పోలీసులు, అధికారులకు ఆ పార్టీకి చెందిన వారే సమాచారం ఇచ్చి పట్టించడం కొసమెరుపు.

టంగుటూరు అంతా ఇసుక డంప్‌లు

రీచ్‌కు అత్యంత సమీపంలో ఉన్న టంగుటూరు అంతా ఇసుక అనధికారిక డంప్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఇవన్నీ కూడా ఇసుకాసుల సొంత డంపింగ్ యార్డులు కావడం గమనార్హం. అధికారికంగా ఒకటిన్నర కిలోమీటర్ దూరంలోని టీవీపురం పంచాయతీ కార్యాలయం(నిర్మాణంలో) ఉన్న చోట డంపింగ్ యార్డును రాజంపేట సబ్‌కలెక్టర్ ప్రారంభించిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం నిర్దేశించిన డంపింగ్ యార్డులో కాకుండా టంగుటూరు గ్రామంలోని ఖాళీ స్థలాల్లో డంపింగ్ చేసేశారు. అధికారిక డంప్‌లో మొక్కుబడిగా కొన్ని ట్రిప్పులు తోలి ఇసుక చూపిస్తున్నారు. టంగుటూరులో అన్నమయ్య బందీఖానా, షాదీఖానా, కైలాసనాథాలయం, వాల్మీకి ఆశ్రమం ఏరియాల్లో ఇసుక డంపింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

ఉచితంగా తీసుకెళ్లే వారికి అడ్డంకులు

చెయ్యేరులో నుంచి ఉచితంగా ఎడ్లబండ్లు, ట్రాక్టర్లలో తీసుకెళ్లే వారికి.. రీచ్ తమ్ముళ్ల ద్వారా అడ్డంకులు సృష్టిస్తున్నారు. పోలీసులు సవాలక్ష కారణాలతో యేటిలోకి రానివ్వకుండా చేస్తున్నారని సామాన్యులు వాపోతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీసుకొచ్చిన ఉచిత ఇసుక విధానానికి ఆ పార్టీ నేతలే తూట్లు పొడుస్తున్నారని ఎడ్లబండ్ల, ట్రాక్టర్ల యజమానులు వాపోతున్నారు.

పేరుకే చెక్‌పోస్టులు



చెయ్యేరులో పోలీసులు స్వాధీనం చేసుకున్న జేసీబీలు

చెయ్యేరు ఇసుక అక్రమ రవాణాకు పోలీసు శాఖ పెట్టిన చెక్‌పోస్టులు పేరుకే ఉన్నాయనే అపవాదును మూటకట్టుకుంది. మామూళ్ల మత్తులో చెక్‌పోస్టులు ఉన్నాయనే విమర్శలున్నాయి. చెయ్యేరులోని అధికారిక రీచ్‌లో జేసీబీలతో ఇసుక తోడివేత కొనసాగుతోంది. ఇటీవల కూడా పెద్దఎత్తున జేసీబీలు, టిప్పర్లు, ట్రాక్టర్లను పట్టుకున్నారు. తొలిసారిగా జరిమానా వేసి వదిలేశారు.

కొనసాగుతున్న ఉరుసు



ఫకీర్ల విన్యాసాలు తిలకిస్తున్న పీఠాధిపతి ఆరిఫుల్లా హుస్సేని, వివిధ రాష్ట్రాల గురువులు, శిష్య బృందం, భక్తులు

కడప కల్చరల్: ప్రముఖ సూఫీ ఆధ్యాత్మిక క్షేత్రమైన కడప పెద్దదర్గాలో ఉరుసు ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం కూడా భక్తుల కోలాహలంతో దర్గా ప్రాంతం సందడి గా కనిపించింది. సంప్రదాయంగా ఉత్సవాలలో ప్ర త్యేక కార్యక్రమంగా దర్గాలోని ప్రధాన గురువుల మజార్ల వద్ద భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ప్రముఖుల ప్రార్థనలు

ఉత్సవాల సందర్భంగా గురువులను దర్శించుకోవాలని, ప్రధానంగా పీఠాధిపతి హజరత్ సయ్యద్ షా ఆరిఫుల్లా హుసేనీ సాహెబ్ ఆశీస్సులు పొందేందుకు పలువురు ప్రముఖులు విచ్చేశారు. మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథరెడ్డి, నగర మేయర్ సురేష్‌బాబుతోపాటు పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్పొరేటర్లు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే పీసీసీ అధ్యక్షురాలు షర్మిల కూడా దర్గాకు చేరుకుని ప్రార్థనలు చేపట్టారు. దేశం నలుమూలల నుంచి పలువురు ప్రముఖులు నిరాడంబరంగా దర్గాకు విచ్చేసి గురువుల దర్శనం చేసుకుని ఆశీస్సులు పొందారు. ఇక ఇతర ప్రాంతాల నుంచి ఉత్సవాలకు భక్తులు వస్తూనే ఉన్నారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం పీఠాధిపతి, ఇతర భక్త ప్రముఖులు గండి వాటర్ వర్క్స్ వద్దగల దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, జెండాను ప్రతిష్ఠించి అన్నదానం చేస్తారు. అలాగే రాత్రి 10 గంటలకు స్థానిక మై అల్లా దర్గా నుంచి పీఠాధిపతి నగరోత్సవం ప్రారంభం కానుంది.

క్లుప్తంగా

బుర్రలదిన్నెపల్లి టీచర్ సస్పెన్షన్

రాయచోటి : బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన బుర్రలదిన్నె పాఠశాల ఉపాధ్యాయుడు నాగమునినాయక్‌ను డీఈఓ కె.సుబ్రమణ్యం సస్పెండ్ చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నాగమునినాయక్‌ను సస్పెండ్ చేసినట్లు డీఈఓ మంగళవారం పత్రికలకు అందజేసిన ప్రకటనలో పేర్కొన్నారు. టి.సుండుపల్లి మండలం బుర్రలదిన్నె పాఠశాలలో ఎస్‌జీటీగా పని చేస్తున్న నాయక్ విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు పిల్లల తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారని ఆయన తెలిపారు. దీంతో ఉపాధ్యాయుడిపైన విచారణ చేసి జిల్లా కలెక్టర్‌కు నివేదిక ఇచ్చామన్నారు. కలెక్టర్ ఆదేశాలతో టీచర్‌ను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు ఇచ్చామని వివరించారు.

ఫారెస్టు అధికారుల వేధింపులు ఆపాలి

రాయచోటి అర్బన్ : ఫారెస్టు అధికారుల వేధింపుల నుండి దళితుడైన పెద్ద గంగయ్యకు రక్షణ కల్పించాలని దళితహక్కుల పోరాట సమితి (డిహెచ్‌పియస్) జిల్లా ప్రధాన కార్యదర్శి మండెం సుధీర్‌కుమార్ డీఆర్‌ఓ మధుసూదన్‌రావుకు విన్నవించారు. డిహెచ్‌పియస్ నేతలు మంగళవారం డీఆర్‌ఓ మధుసూదన్‌రావును కలెక్టరేట్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి ఫారెస్టు అధికారుల పనితీరుపై ఫిర్యాదు చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేశాపురం దళితవాడకు చెందిన పెద్దగంగయ్య గత 30 సంవత్సరాలుగా ఫారెస్టు భూమికి సమీపంలోని రెండున్నర ఎకరాల భూమిని చదును చేసుకుని వర్షాధారంగా పంటలు సాగుచేసుకుంటున్నాడన్నారు. కాగా ఫారెస్టు గార్డు రత్నమ్మ భూమిసాగు విషయంలో గంగయ్యపై బెదిరింపులకు పాల్పడడం, సాగుచేసిన పంటలను దున్నేయడం ద్వారా నష్టపరిచేదన్నారు. ఈ విషయంపై కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు గంగయ్య భూమిపై విచారించగా గంగయ్య భూమితో పాటు పక్కనే ఉన్న ఉన్నత కులాలకు చెందిన మలసాని రాధమ్మ, వసంతల ఆధీనంలోని 10 ఎకరాల మామిడితోట కూడా ఆక్రమణలో ఉందంటూ తేల్చారన్నా రు. కాగా ఫారెస్టుగార్డు రత్నమ్మ మామిడి తోటను సాగుచేస్తున్న ఉన్నత కులాల వారిని ఏమీ అనకపోగా, దళితుడైన గంగులయ్యను పంట సాగు చేయకుండా అడ్డుకోవడంతో పాటు వేధింపులకు గురిచేస్తోందంటూ ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో డిహెచ్‌పియస్ నేత పండరయ్య, బాధితుడు గంగులయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణల అధికారికి అందలం

- బి.కొత్తకోటలో ఆలయ భూమి రక్షణలో విఫలమైన ఈఓ మునిరాజపై అభియోగాల నమోదు, చార్జ్ మెమోలు
- ఇప్పుడు తంబళ్లపల్లె ఈఓగా ప్రమోషన్ ఇచ్చి బి.కొత్తకోట, మొగలి ఆలయాల అదనపు బాధ్యతలు


బి.కొత్తకోట చెన్నకేశవస్వామి ఆలయం

బి.కొత్తకోట : అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారికి ఉన్నతాధికారులు అందలం ఎక్కించారు. ఆరోపణలపై విచారణలు, అభియోగాల నమోదు వంటి చర్యలు మొదలైనప్పటికీ అధికారులు వీటిని పరిగణలోకి తీసుకోకుండా ఏకంగా మూడు పదవులు కట్టబెట్టారు. ఈ వివరాల్లోకి వెళితే.. బి.కొత్తకోట ఆలయాలకు గ్రేడ్-3 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా మునిరాజ విధులు నిర్వహిస్తుండగా పలు ఆరోపణలు వచ్చాయి. ప్రధానంగా చెన్నకేశవ స్వామి ఆలయానికి చెందిన సర్వేనంబర్ 1726/1, 1840లోని భూమికి వేలంపాటలు నిర్వహించి లీజుకు అప్పగించారు. ఈ భూమిలో ఇసుక నిల్వలు ఉండగా భారీస్థాయిలో తరలిపోయింది. దీనితో లీజు భూమి ఎక్కడుందో కనిపించని పరిస్థితి నెలకొంది. దీనిపై అందిన ఫిర్యాదుతో దేవదాయ ధర్మాదాయశాఖ ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. విచారణలో మునిరాజ ఆలయ భూముల పరిరక్షణలో విఫలమైనట్లు గుర్తించారు. భూమిలోని ఇసుక తరలిపోకుండా అడ్డుకోవడంలో, భూమిని కాపాడడంలో విఫలమైనట్లు నిర్ధారించారు. ఇసుక తరలిపోతున్నా పట్టించుకోకపోగా పోలీసులకు ఫిర్యాదు చేసి కేసు నమోదు చేయడంలో నిర్లక్ష్యం వహించడం, తదితర కారణాలతో కమిషనర్ అభియోగాలను నమోదు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీనికి ముందు చార్జ్ మెమోలను కూడా జారీ చేసి సంజాయిషీ కోరారు. ఇలా ఉండగా స్థానిక బీరంగిరోడ్డులోని గంగమ్మ ఆలయ మాన్యం భూమిలో 13 వాణిజ్య కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. వీటి యజమానుల నుంచి రూ.16 లక్షల అద్దె వసూలు చేసినట్లు అధికారుల దృష్టికి తెచ్చారు. ఈ అద్దెకు సంబంధించి రశీదులు చెల్లించలేదని చెల్లింపుదారులు చెబుతుండగా ఇటీవల జిల్లా అధికారి విశ్వనాథ్ విచారణ జరిపారు. మునిరాజతో కలిపి అద్దెదారులతో విచారించారు. ఈవిచారణలో తేలిన అంశాలతో విశ్వనాథ్ నివేదికను డెప్యూటీ కమిషనర్‌కు పంపారు. మునిరాజకు రూ.16 లక్షలు చెల్లించామని అద్దెదారులు చెబుతుంటే..తనకు చెల్లించింది రూ.1,30,400 మాత్రమే అని ఈఓ విచారణలో వెల్లడించారు. అద్దెదారులు ఎంత చెల్లించి ఉంటే అంతే మొత్తానికి రసీదులు ఇచ్చామని ఈఓ పేర్కొన్నారు. అయితే పూర్తి విచారణలో ఏమి తేలిందో వెలుగులోకి రాలేదు. అయితే నివేదిక డీసీకి చేరింది. చెన్నకేశవస్వామి మాన్యం భూమి ఇసుక తరలిపోవడం, అద్దె వసూళ్ల ఆరోపణలపై దేవాదాయశాఖ కమిషనర్ చర్యలు తీసుకోవాల్సి ఉంది.

మూడు పోస్టులు ఇచ్చేశారు..

ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారి విషయంలో ఉన్నతాధికారులు అండగా నిలుస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల జరిగిన బదిలీల్లో తంబళ్లపల్లె నియోజకవర్గంలో అత్యంత ప్రముఖ ఆలయం మల్లయ్యకొండపై వెలసిన మల్లికార్జునస్వామి ఆలయానికి ఈఓగా బదిలీ చేశారు. అంతటితో సరిపెట్టకపోగా బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం, ములకలచెరువు మండలాలకు చెందిన గ్రూప్ టెంపుల్స్ ఈఓగా, చిత్తూరుజిల్లా మొగిలి ఆలయాలకు ఈఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

కమిషనర్ వద్ద పెండింగ్

మునిరాజపై చర్యలు తీసుకునే ఫైల్ కమిషనర్ వద్ద పెండింగ్‌లో ఉందని జిల్లా అధికారి విశ్వనాథ్ చెప్పారు. ఇప్పటికే అతనిపై అభియోగాలు నమోదయ్యాయని చెప్పారు. అధికారుల కొరత, కొందరు అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగించినా సుముఖత లేకపోవడంతో మునిరాజకు అప్పగించడం జరిగిందని చెప్పారు. ఈ విషయమై ఈఓ మునిరాజ మాట్లాడుతూ ఇసుక తరలింపులో తన ప్రమేయం లేదన్నారు. రెవెన్యూ, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని చెప్పారు.

మదనపల్లెలో వెరైటీ దొంగతనాలు

విలువైన డోర్‌లాక్‌లు చోరీ


ఎస్‌బీఐ కాలనీలో ఇంటి డోర్‌లాక్‌ను దొంగిలించిన గుర్తు తెలియని వ్యక్తులు

మదనపల్లె : పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలో వెరైటీ దొంగతనాలు జరిగాయి. ఇళ్లలోని విలువైన వస్తువులను దొంగలించకుండా, కేవలం ఇంటి తలుపులకు ఉన్న విలువైన లాక్‌లను చోరీ చేసుకుని వెళ్లడం జరిగింది. టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎస్‌బీఐ కాలనీలో ఉన్న స్థానికులు సోమవారం రాత్రి ఎప్పటిలానే తలుపులకు గడియలు వేసుకుని లోపల నిద్రించారు. అయితే మంగళవారం తెల్లవారుజామున 2గంటల సమయంలో ఓ ఇంటి ముందు తలుపు తాళం తీస్తున్నట్లు శబ్దం రావడంతో ఆ ఇంట్లోని వ్యక్తులు మేల్కొని గమనిస్తే.. కొందరు గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు చోరీచేసి పారిపోవడం చూశారు. వెంటనే బయటకు వచ్చి స్థానికులను అప్రమత్తం చేశారు. అప్పటికే దొంగలు ఏడు ఇళ్లలో ఇంటి డోర్‌కు ఉన్న బ్రాస్ మెటల్‌తో తయారు చేసిన విలువైన డోర్‌లాక్‌లు, హ్యాండిల్స్ చోరీ చేశారు. మార్కెట్‌లో వీటి విలువ ఒకొక్కటి రూ.7వేల వరకు ఉంటుందని ఇంటి యజమానులు తెలిపారు. చోరీ విషయాన్ని టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించారు. అక్కడ ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీని చూశారు. దొంగలను గుర్తించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా ఇదేవిధంగా ఇటీవల పట్టణంలోని సొసైటీకాలనీలోనూ చోరీలు జరిగినట్లు సమాచారం.

వన్యప్రాణులను వేటాడితే చర్యలు


అటవీ ప్రాంతాలను తనిఖీ చేస్తున్న స్క్వాడ్ డీఎఫ్‌ఓ రాజశేఖర్‌బాబు, సిబ్బంది

సిద్దవటం : వన్య ప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తప్పవని కడప ఫ్లైయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌ఓ రాజశేఖర్ బాబు హెచ్చరించారు. సిద్దవటం రేంజిలోని రోళ్ళ బోడు బేస్ క్యాంప్ , గొల్లపల్లె బీటు, సాకిరేవులు, బండిగానిసెల, లంక వంటి సమస్యాత్మక ప్రాంతాలను మంగళవారం అటవీ అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎఫ్‌ఓ రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ వన్యప్రాణుల సంరక్షణ, ఎర్రచందనం పరిరక్షణపై సిబ్బందికి పలు సూచనలు ఇచ్చామన్నారు. అటవీ ప్రాంతంలోని సంపదను తరలిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్లైయింగ్ స్క్వాడ్ ఎఫ్‌ఆర్‌ఓ మదన్‌మోహన్‌రెడ్డి, సిద్దవటం రేంజర్ ఓబులేసు, ఎఫ్‌బీఓ విశ్వనాథ్, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

హామీలు అమలు చేయరా..?


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కేవీపల్లె : సూపర్‌సిక్స్ పథకాల పేరుతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అవి అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తీతవగుంటపల్లె పంచాయతీ ఇర్రివాండ్లపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇర్రి చిన్నయ్యనాయుడు కుటుంబ సభ్యులను మంగళవారం మాజీ ఎమ్మెల్యే పరామర్శించారు. అలాగే నూతన కాల్వ పంచాయతీ కురవపల్లెలో పార్టీ నాయకుడు చామంచుల నాగరాజ తండ్రి చామంచుల లక్ష్మయ్య మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలను మభ్యపెట్టి మోసం చేయడంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు మించిన వారు మరెవరూ ఉండరని ఆరోపించారు. ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఇప్పటి వరకు ఒక్కటి కూడా సక్రమంగా అమలు చేయలేదని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీకి పూర్వవైభవం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఈశ్వరమ్మ, పార్టీ మండల కన్వీనర్ వెంకటరమణా రెడ్డి, నాయకులు సి.కె. యర్రమరెడ్డి, జయరామచంద్రయ్య, వెంకటసిద్ధులు, రామకొండారెడ్డి, కోర్టు సుబ్బారెడ్డి, ఆనంద రెడ్డి, సతీష్‌రెడ్డి, సిద్ధయ్య, రాంప్రసాద్‌నాయుడు, రత్నాకర్‌రెడ్డి, పి. ద్వారకనాథరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, హరిబాబు, రెడ్డెప్పరెడ్డి, యర్రమరెడ్డి, నాగేశ్వర, గౌస్, బాలకృష్ణ, వేణుగోపాల్‌రెడ్డి, అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు


ద్విచక్రవాహనం అదుపుతప్పి తీవ్రంగా గాయపడిన మోహన


బొలెరో వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడిన రైతు రామచంద్ర

మదనపల్లె : వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు వ్యక్తులు గాయపడి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సలు పొందుతున్నారు. కలకడ మండలం ఎనుగొండపాలేనికి చెందిన దంపతులు మోహన(55), అంజనమ్మ(45)లు ద్విచక్రవాహనంలో వాల్మీకిపురానికి వచ్చి పనులు ముగించుకుని తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా, మార్గమధ్యంలోని టమాటా మార్కెట్ వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడ్డారు. ప్రమాదంలో మోహన తీవ్రంగా గాయపడగా, అంజనమ్మ స్వల్పంగా గాయపడింది. అదే విధంగా మదనపల్లె మండలం సీటీఎం పంచాయతీ గంగాపురానికి చెందిన మల్లయ్య, లక్ష్మీదేవి(55) ద్విచక్రవాహనంలో వ్యక్తిగత పనులపై పంచాయతీ ఆఫీసుకు వెళ్లి తిరిగి ఇంటికి వెళుతుండగా, మార్గమధ్యంలోని గంగమ్మ గుడి సమీపంలో ద్విచక్రవాహనాన్ని ట్రాక్టర్ ఢీకొంది. ప్రమాదంలో లక్ష్మీదేవి తీవ్రంగా గాయపడింది. ఆయా ఘటనల్లో గమనించిన స్థానికులు బాధితులను 108 వాహనాల్లో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

రైతుకు తీవ్రగాయాలు

రామసముద్రం : బొలెరో వాహనం ఢీకొని రైతు తీవ్రంగా గాయపడిన సంఘటన రామసముద్రం మండలంలో మంగళవారం జరిగింది. ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య కథనం మేరకు...రామసముద్రం మండలం నారేవారిపల్లెకు చెందిన రైతు రామచంద్ర(40) మంగళవారం ఉదయం ఊరికి సమీపంలోని తన వ్యవసాయ బోరు వద్దకు బైకులో వెళుతుండగా, మార్గమధ్యంలోని కాప్పల్లె వద్ద వేగంగా వస్తున్న బొలెరో వాహనం బైకును ఢీకొంది. సమాచారం అందుకున్న కుటుంబీకులు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ రామచంద్రను చికిత్స నిమిత్తం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో రైతును తిరుపతి రుయాకు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

స్కూటరిస్టుకు గాయాలు


ప్రమాదంలో గాయపడ్డ నాగభూషణం

కేవీపల్లె : గుర్తు తెలియని వాహనం ఢీకొని స్కూటరిస్టుకు తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని గోరంట్లపల్లె పంచాయతీ అంబువారిపల్లె వద్ద చోటు చేసుకుంది. వివరాలిలావున్నాయి. కేవీపల్లె మండలం నారమాకులపల్లెకు చెందిన నాగభూషణం (34) పీలేరు పట్టణంలోని ఓ దుకాణంలో పని చేసేవాడు. మంగళవారం రాత్రి విధులు ముగించుకుని ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి బయలుదేరాడు. అయితే మార్గం మధ్యలోని అంబువారిపల్లె సమీపంలో ఎదురుగా వచ్చిని గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నాగభూషణంను చికిత్స నిమిత్తం 108 వాహనంలో పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ ట్యాంక్ అంటుకుని..

మదనపల్లె : ద్విచక్రవాహనం పెట్రోల్ ట్యాంకు మంటలతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం ములకలచెరువు మండలంలో జరిగింది. చౌడసముద్రానికి చెందిన టి.వెంకటరమణ (35) బైక్‌కు పెట్రోల్ కొట్టించి, లాక్ చేయడం మరచిపోయాడు. తర్వాత కొంత దూరం వచ్చాక ద్విచక్రవాహనాన్ని నిలిపి సిగరెట్ తాగేందుకు అగ్గిపుల్లను వెలిగించాడు. పెట్రోల్ ట్యాంక్ ఓపెన్‌లో ఉండటంతో ఒక్కసారిగా మంటలు రావడంతో వెంకటరమణ ఛాతీపై తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు బాధితుడ్ని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం బాధితుడ్ని తిరుపతికి రెఫర్ చేశారు.

మహిళ అదృశ్యం


లక్ష్మమ్మ

రామసముద్రం : మాటలు రాని ఓ మహిళ రామసముద్రంలో అదృశ్యం అయినట్లు కుటుంబీకులు తెలిపారు. పుంగనూరు మండలం కోటగడ్డకు చెందిన లక్ష్మమ్మ గత బుధవారం రామసముద్రం మండలం కుప్పనపల్లెలోని తమ బంధువుల ఇంటికి వచ్చింది. అయితే అక్కడకు పోకపోవడంతో కుటుంబీకులు విషయం తెలుసుకుని ఆమె ఆచూకీ కోసం బంధువులు, చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించారు. ఆమె ఆచూకీ లభిస్తే 7816074557, 9441135259 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

బాలుడు..


కార్తీక్

మదనపల్లె : బాలుడు అదృశ్యమైన సంఘటన మదనపల్లె పట్టణంలో మంగళవారం జరిగింది. ఇండస్ట్రియల్ ఎస్టేట్‌కు చెందిన నరసింహులు కుమారుడు ఆర్.కార్తీక్(14) స్థానికంగా ఓ ప్రైవేటు స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. ఇటీవల చదువులో వెనుకబడడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్థాపం చెందిన విద్యార్థి కార్తీక్ మధ్యాహ్నం 2 నుంచి కనిపించకుండా పోయాడు. చుట్టుపక్కల గాలించిన తల్లిదండ్రులు ఫలితం లేకపోవడంతో టు టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆస్పత్రి వైద్యుడిపై విచారణ

మదనపల్లె : స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో పని చేస్తున్న వైద్యుడు వరప్రసాద్‌పై విచారణ చేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గాయిత్రి శ్రీశ్రీ తెలిపారు. ఈనెల 16వ తేదీ ఓపీ విభాగంలో పని చేస్తున్న డాక్టర్ వరప్రసాద్ చికిత్స కోసం వచ్చిన రోగులతో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు ఫిర్యాదు అందడంతో, ఆర్ఎఓ ప్రసాద్‌రాజు, మరో ఇద్దరు వైద్యుల బృందంతో కలిసి విచారణ చేశామన్నారు. డాక్టర్‌పై ఇంతకుముందు రోగుల చికిత్స సమయంలో ఎటువంటి ఫిర్యాదులు లేకపోవడంతో మందలించి పనితీరు మార్చుకోవాల్సిందిగా సూచించినట్లు తెలిపారు.

నోటరీ పేరుతో భారీ వసూళ్లు

బి.కొత్తకోట: విద్యార్థుల జనన ధృవీకరణ పత్రాలు పొందడానికి నోటరీ ఇవ్వడం కోసం తల్లిదండ్రుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని బి.కొత్తకోటలో కొందరు భారీ వసూళ్లకు పాల్పడుతున్నారు. విద్యార్థులకు సంబంధించిన జన్మదిన తేది, పేరులో సవరణల కోసం ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీనికి నోటరీ ఇవ్వాలని మొదట చెప్పడంతో తల్లిదండ్రులు నోటరీ కోసం రూ.400 నుంచి రూ.500 వరకు చెల్లించుకోవాల్సి వచ్చింది. ఒక్క నోటరీకి రూ.100కి మించి ఖర్చు అవ్వదు. అలాంటి అవసరాన్ని ఆసరాగా చేసుకుని భారీగా దండుకుంటూ పేదలను పీల్చి పిప్పి చేస్తున్నారు. కనీస అవగాహన లేని పేదలు కూలి చేసి సంపాదించిన సొమ్మును ఇలా చెల్లించుకొంటున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే వారికి రూ.200కే నోటరీ ఇస్తున్నారు. ఈ విషయమై ప్రజలు అధికారులకు మొరపెట్టుకున్నా ఎవ్వరూ పట్టించుకోలేదు. కనీసం నియంత్రణకైనా స్పందించలేదు. ఫలితంగా నోటరీ ఇచ్చేవాళ్లు ఇష్టానుసారంగా దోచుకుంటున్నారు. నోటరీ కాగితాల్లో సంబంధిత నోటరీ కలిగిన వారి సీలు, సంతకాలతో తీసుకొచ్చి అధిక ధరలకు విక్రయించుకొంటూ సొమ్ము చేసుకుంటున్నారు. దీనిపై విద్యాశాఖ అధికారులు మాట్లాడుతూ జనన ధృవీకరణ పత్రాలు, పేరు సవరణల కోసం నోటరీ అవసరం లేదని స్పష్టం చేశారు. ఎవరైనా నోటరీ తీసుకోవాలని చెప్పినా నమ్మవద్దని కోరారు. నోటరీ లేకుండానే ధృవీకరణ పత్రాలను జారీ చేస్తామని, తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

జాతీయ పోటీలకు 'కోన' విద్యార్థులు

కలకడ : జాతీయస్థాయి హ్యాండ్ బాల్‌పోటీలకు కోన విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు చెంగల్‌రాయుడు తెలిపారు. అండర్ 14 విభాగంలో 25వ తేదీ నుంచి 29వ తేదీ వరకూ చత్తీస్‌గడ్‌లో జరిగే జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలలో కలకడ మండలం కోన జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు సాయినాథ్, మోక్షిత పాల్గొననున్నట్లు రాష్ట్ర స్థాయి క్రీడాసంస్థ నుంచి సమాచారం అందినట్లు హెచ్‌ఎం తెలిపారు. అక్టోబర్‌లో తెనాలిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభ కనపరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పాటు రాష్ట్ర స్థాయి కోచ్‌గా ఎంపికైన కోన ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఝాన్సీ రాణిని మంగళవారం హెచ్‌ఎం, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

సకాలంలో నివేదికలు అందజేయాలి

రాయచోటి అర్బన్ : షెడ్యూలు కులాల వర్గీకరణకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ వెంటనే బాధ్యతలు చేపట్టి సకాలంలో నివేదికలు అందచేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ అన్నారు. అన్నమ య్య జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం ఆయన స్థానిక ఎన్‌జీఓ సభా భవనంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీవర్గీకరణ అంశం దశాబ్దకాలంగా వివాదాలతో నలిగి కోర్టుకు చేరింద న్నారు. 2024 ఆగస్టు1న ఎస్సీ వర్గీకరణ చేసుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. దీంతో కూటమి ప్రభుత్వం ఎస్సీవర్గీకరణ అమలుకు సంబంధించి రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. కమిషన్ తనకు ప్రభుత్వం ఇచ్చిన కాలవ్యవధిలోగా ఎస్సీ జాబితాలోని 59 కులాల గణాంకాలను నిష్పక్షపాతంగా సేకరించాలంటూ కోరారు. కార్యక్రమంలో డప్పుకళాకారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ నాగభూషణం, ఎంఆర్‌పియస్ రాష్ట్రకార్యదర్శి ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి బి.పెంచలయ్య పాల్గొన్నారు.

డీజిల్ కొరతతో ఆగిన ఆర్టీసీ బస్సు

రెండు గంటల పాటు ఇబ్బందులు పడిన ప్రయాణికులు


చిన్నమండెం మండలంలో డీజిల్ కొరతతో ఆగిపోయిన ఆర్టీసీ బస్సు

చిన్నమండెం : రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సొంత ఇలాఖాలో డీజిల్ కొరతతో ఆర్టీసీ బస్సు నిలిచిపోగా.. రెండు గంటల పాటు ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడిన సంఘటన చిన్నమండెం మండలంలో చోటు చేసుకుంది. ప్రయాణీకుల కథనం మేరకు.. మదనపల్లె డిపోకు చెంది రాయచోటి నుండి మదనపల్లెకు ఏపీ03 టీఈ 2609 నెంబర్ గల బస్సు బయలుదేరింది. రాయచోటి నుండి మదనపల్లెకు వెళ్తుండగా చిన్నమండెం మండలం దిన్నెమీదపల్లె క్రాస్ వద్దకు రాగానే డీజిల్ కొరతతో ఆగిపోయింది. ఆర్టీసీ అధికారులు వెంటనే స్పందించి డీజిల్ తెచ్చి వేసినా బస్సు స్టార్ట్ కాలేదు. దీంతో ప్రయాణీకులు రెండు గంటల పాటు వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. అత్యవసర పనుల నిమిత్తం కొంత మంది ఉండగా మరికొందరు ఆసుపత్రులకు.. పలు పనుల నిమిత్తం వెళ్లాల్సిన వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అనంతరం స్పందించిన ఆర్టీసీ అధికారులు ఇతర ఆర్టీసీ బస్సులలో ప్రయాణీకులను అనుమతించడం జరిగింది. కండీషన్ ఉన్న బస్సులు నడపాలని ప్రజలు కోరుతున్నారు.

చీటింగ్ కేసులో ముగ్గురి అరెస్ట్

గుత్తి : ప్రభుత్వ శాఖల్లో పర్మినెంట్ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుద్యోగులను మోసం చేసిన ముగ్గురిని సోమవారం రాత్రి పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన మేరకు... కర్నూలుకు చెందిన మేరి సునీత, అన్నమయ్య జిల్లాకు చెందిన గుర్రం ప్రసాదరెడ్డి, షేక్ బాబ్జాన్ సాహెబ్ తదితరులు గుత్తికి చెందిన నిఖిల్‌తో పాటు మరి కొందరు నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నమ్మబలికి రూ.15 లక్షలు వసూలు చేశారు. నెలలు గడుస్తున్నా ఉద్యోగావకాశాలు కల్పించకపోవడంతో తాము మోసపోయినట్లుగా గుర్తించిన నిఖిల్, తదితరుల ఫిర్యాదు మేరకు చీటింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.

పంటనూర్పిడి బండ ఆక్రమణను అడ్డుకున్న గ్రామస్తులు

- పొలానికి దారి లేకుండా చేయడంపై ఆగ్రహం
- రెవెన్యూ అధికారులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోని వైనం
- అధికార పార్టీ అండతో రూ.12 కోట్ల భూమి కాజేసేందుకు యత్నం


బండ స్థలంలో చదును పనులను అడ్డుకున్న గాండ్లపల్లె గ్రామస్తులు

మదనపల్లె : రైతులు పంట ఉత్పత్తులను నూర్పిడి చేసుకునేందుకు, ఎండబెట్టుకునేందుకు చాలాకాలంగా వినియోగిస్తున్న బండను, అక్రమార్కులు చదును చేసేందుకు ప్రయత్నిస్తే గ్రామస్తులు అడ్డుకున్న ఘటన మంగళవారం మండలంలో జరిగింది. పోతబోలు పంచాయతీ మదనపల్లె-తిరుపతి హైవేకు ఆనుకుని, గాండ్లపల్లెకు వెళ్లే దారిలో సర్వేనెంబర్లు.141-బి/1, ఇతర నెంబర్లలో దాదాపు 3 ఎకరాలకు పైగా బండ ఉంది. దీనిని సమీప గ్రామస్తులు పంట ఉత్పత్తులు నూర్పిడికి, కొటారు బండగా వినియోగిస్తున్నారు. దాదాపు పదేళ్ల క్రితం ఈ బండను ఓ మిలిటరీ సైనికుడికి ప్రభుత్వం పట్టా కింద మంజూరుచేస్తే...గ్రామస్తులు అందరూ నిరసన తెలపడంతో, అప్పటి కలెక్టర్ విచారణ చేసి వ్యవసాయ యోగ్యం లేని బండను, గుట్టను కేటాయించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై అప్పట్లో మీడియాలో వార్తలు ప్రచురితం కావడంతో, బండ కేటాయింపును రద్దు చేయాలని పట్టాదారుడు రెవెన్యూ శాఖకు అర్జీ పెట్టుకోవడంతో రద్దు చేశారు. తర్వాత ఇది ప్రభుత్వస్థలంగానే పరిగణించడం జరుగుతోంది. అయితే ఇటీవల ఈ బండకు ఆనుకుని, తిరుపతి-మదనపల్లె నేషనల్ హైవే వెళ్లడం, బహిరంగ మార్కెట్‌లో దీని విలువ రూ.12కోట్లకు పైగా విలువ చేస్తుండటంతో దీనిని ఎలాగైనా సొంతం చేసుకోవాలని కొందరు పావులు కదపడం ప్రారంభించారు. అధికార పార్టీ నాయకులను మచ్చిక చేసుకుని, తమకు అనుకూలమైన రెవెన్యూ అధికారుల సహకారంతో రద్దు అయిన భూమికి, పాత పత్రాలను చూపిస్తూ, చదును చేసేందుకు ప్రయత్నించారు. ఈ స్థలం వెనుకకు సర్వేనెం.141-2-6లో గాండ్లపల్లెకు చెందిన బుడ్డక్క లక్ష్మన్న, ఈశ్వరయ్యలు రెండు ఎకరాల్లో అల్లనేరేడు చెట్లు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం ఈ బండను అక్రమార్కులు చదును చేస్తుండటంతో తన పొలానికి దారి లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. విలువైన ప్రభుత్వస్థలాన్ని దొడ్డిదారిలో కాజేసేందుకు అక్రమార్కులు ప్రయత్నిస్తుంటే, అడ్డుకోవాల్సిన రెవెన్యూ అధికారులు సహకారం అందించడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బండ ఆక్రమణపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.